www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 7 మే 2025
5
వైఎస్ఆర్



ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం : డిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : డయల్ యువర్ ఆర్టిసి డిఎంకు వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని డిఎం డిజేశ్వరరావు తెలిపారు. మంగళవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫోన్ ద్వారా ఆరు సమస్యలు వచ్చాయి. కడప నుంచి పామూరుకు బస్సు కల్పించాలని, కడప నుంచి బద్వేల్‌కు రాత్రి 8.30 గంటల తరువాత వయా ఖాజీపేట మీదుగా బస్సు నడపాలని ప్రయాణికులు కోరారు. విజయవాడ వెళ్లే సర్వీస్‌లో పోరుమామిళ్ల కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, కడప నుంచి గాలివీడుకు నైట్ అవుట్ సర్వీస్ ఏర్పాటు చేయాలని ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. కడప నుంచి తిరుపతికి, తిరుపతి నుంచి కడపకు వచ్చే బస్సులు అన్నయ్య రాజంపేటలో పాత బస్టాండ్ మీదుగా వెళ్లేలా చూడాలన్నారు. బస్ స్టేషన్ లో ఉన్న స్టాల్స్‌లో ఎమ్మార్పీ రేట్లకు విక్రయించాలని కోరారు. తమ పరిధిలో ఉన్న వాటికి సాధ్యమైనంత వరకు పరిష్కారం చేస్తామని డిఎం పేర్కొన్నారు.

టిడిపిలో 'స్థానిక' వేడి!

- మహానాడులోపే కసరత్తు
- 20లోపు మండల కమిటీల ఏర్పాటు
- గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సిఎం చంద్రబాబు



టిడిపిలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి పెరుగుతోంది. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన ఏడాది అవుతున్న నేపథ్యంలో సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి సారించింది. కడప, అన్నమయ్య జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కోవడానికి కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో పీలేరు, రైల్వేకోడూరు, మైదుకూరు, ప్రొద్దుటూరు మినహా మిగిలిన చోట్ల ఆధిపత్య పోరు పతాక స్థాయిలో ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కోసం నాయకులు కలిసికట్టుగా కృషిచేసి అద్భుత ఫలితాలను రాబట్టారు. పలు నియోజకవర్గాల్లో ఆధిపత్య పోరుకు తెరలేచింది. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో కడపలో ప్రతిష్టాత్మకంగా టిడిపి మహానాడు నిర్వహణకు సంకల్పించింది. ఈ నెల 20 నాటికి ఆయా నియోజకవర్గ, మండల కమిటీ ఎంపికను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల నేపథ్యంలో టిడిపి నియోజకవర్గ నాయకత్వం స్థానిక కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించిన నేపథ్యంలో కథనం..

ప్రజాశక్తి – కడప ప్రతినిధి

టిడిపిలో స్థానిక సంస్థల వేడి మొదలైంది. కడప జిల్లాలో ఈ నెల 27, 28, 29వ తేదీల్లో మహానాడు నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేపట్టింది. పలుమార్లు రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితతో కలిసి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సభావేదిక ఏర్పాటు స్థలం ఖరారుకు కసరత్తు చేసింది. రెండ్రోజుల కిందట చింతకొమ్మదిన్నె మండలం పబ్బాపురం సమీపంలోని స్థలంలో ఏర్పాటుకు మొగ్గు చూపింది. మహానాడు ఆనవాయితీ ప్రకారం నిర్వహణకు ముందే స్థానిక కమిటీలను నియమించాల్సి ఉంది. ముఖ్యమంత్రి ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన 66 మండలాలకు కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. కడప జిల్లాలో మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, అన్నమయ్య జిల్లాలో పీలేరు, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో మినహా మిగిలిన ఎనిమిది నియోజక వర్గాల్లో ఆధిపత్య పోరు, అంతర్యుద్ధాలు తలెత్తే స్థాయిలో ఉంది. పులివెందుల నియోజకవర్గ టిడిపి నాయకత్వం ఇన్‌ఛార్జి మంత్రి ఎదుటే ఇరువర్గ నాయకులు అనుచరులు బాహాబాహీకి దిగిన సంగతి తెలిసిందే. ఇలాంటి పరిస్థితే కడప మొదలు ఇతర నియోజకవర్గాల్లోనూ కనిపిస్తోంది. రాజంపేట నియోజకవర్గంలో ఇదే పరిస్థితి తీవ్రత పతాక స్థాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. అవకాశం దొరికినప్పుడల్లా పరస్పరం అధిష్టానానికి ఫిర్యాదులు చేసుకోవడం పరిపాటిగా మారింది. నియోజకవర్గాల బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యేలకు మండల కమిటీలను నియమించడం కత్తి మీద సాము తలపించనుంది. స్థానిక కమిటీల ఏర్పాటు వ్యవహారాల బాధ్యతల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు ఇష్టంలేనివారు ఏకపక్ష నియామకాలకు అవకాశం ఉంది. విభేదాలు తారాస్థాయికి చేరుకునే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అసమ్మతుల ప్రభావం అతి సమీపంలో రానున్న స్థానిక సంస్థలైన పంచాయతీలు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు.

ఈ నెల 20 నాటికి స్థానిక కమిటీలను ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన టిడిపి నాయకత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో కూటమి సర్కారు సుమారు ఏడాదిగా అధికారంలో కొనసాగుతోంది. తమ గెలుపుకు సహకరించిన పార్టీ నాయకత్వానికి ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిల పట్ల ఉప్పునిప్పుగా మారిన వర్గీయ గ్రూపులు అధిష్టానానికి ఫిర్యాదుల పర్వం కొనసాగిస్తున్న నేపథ్యం అందరికీ తెలిసిందే. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జి నియామకాల పట్ల స్పష్టత లేకపోవడంతో గందరగోళ వాతావరణం కనిపిస్తోంది. కడపలో ఎమ్మెల్యే మాధవి, పులివెందులలో బి.టెక్ రవి, జమ్మలమడుగులో భూపేష్‌రెడ్డి, అన్నమయ్య జిల్లాలో రాయచోటిలో మంత్రి మండిపల్లి, పీలేరులో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, మదనపల్లిలో చాన్‌బాషా, తంబళ్లపల్లి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని బలోపేతం చేయాల్సి ఉంది. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఆధిపత్య పోరును అధిగమించి, పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసు కోవడంపైనే పార్టీ భవిష్యత్ ఆధారపడి ఉంటుందనే వాదన వినిపిస్తోంది.

సుందరయ్య ఆశయ సాధనకు ఉద్యమించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - బద్వేలు

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో డివైఎఫ్ఐ నాయకులు చిన్ని అధ్యక్షతన మంగళవారం సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షులుగా ట్రంప్ ఎన్నికయ్యాక ఐక్యరాజ్యసమితికి తమ వాటా నిధులు ఇవ్వకుండా నిరాకరిస్తూ, నిర్వీర్యం చేస్తున్నారని, అంతర్జాతీయ శాంతి పరిరక్షణ విఫలం చేయడానికి కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొలంబియా, మెక్సికో, బ్రెజిల్, శ్రీలంక, ఉరుగ్వే దేశాలలో అభ్యుదయ శక్తులు ఎన్నికల్లో గెలిచి, అధికారం చేపట్టారని ప్రజారంజకంగా పరిపాలిస్తున్నారని వారు గుర్తుచేశారు. పార్లమెంటులో మొదటి ప్రతిపక్ష నాయకుడుగా పనిచేసిన కమ్యూనిస్టు నాయకుడని, సిపిఎం తొలి ప్రధాన కార్యదర్శిగా మే 19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలను దేశవ్యాప్తంగా సిపిఎం ఘనంగా నిర్వహిస్తోందని, జిల్లాలో ప్రతి మండలంలో సుందరయ్య వర్ధంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు దేశంలో మోడీ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విచారణ వ్యవస్థలైన ఈడి, ఐటి, సిబిఐ సంస్థలను తమ రేసు కుక్కలుగా ప్రతిపక్ష పార్టీలపైన, తిరగబడ్డ మిత్రపక్షాలపైన ఉసిగొల్పి వారిని ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసి, మానసికంగా లొంగ తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బలమైన ప్రతిపక్షం ఉండాలని తెలిపారు. బిజెపి హిందుత్వమత నియంత్రత్వ నియో ఫాసిస్టు పరిపాలనగా కొనసాగుతోందని అన్నారు. బిజెపి రాజకీయాలు దేశ సమైక్యత, సమగ్రతలకు, ప్రజల ఐక్యతకు ముప్పు తెచ్చి పెట్టే విధంగా ఉన్నాయని చెప్పారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేయకపోయినా, రాష్ట్ర విభజన చట్టం లోని ప్రత్యేక హోదా లేదన్నా పల్లంతా మాట కూడా ప్రశ్నించలేని పరిస్థితుల్లో టిడిపి, జనసేన, వైసిపిలు ఉన్నాయన్నారు. సమావేశంలో సిపిఎం బద్వేలు పట్టణ కార్యదర్శి కె. శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పఠాన్ చాంద్ బాషా, సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ సభ్యులు మోక్షమ్మ, ఖైరున్ బి, బాబు, శివ, అనంతమ్మ , శాఖా కార్యదర్శులు బాలమ్మ, మూరా ప్రసాద్, పి.సీ. కొండయ్య, మస్తాన్ బి, సిపిఎం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

మున్సిపల్ కార్మికుల
సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బద్వేలు

మున్సిపల్ ఉద్యోగ - కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బద్వేలు మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటి యు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం పాత మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ కోశాధికారి కాలువ శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ మున్సిపల్ కార్మికులకు గత సమ్మె కాలంలో ఇచ్చిన వాగ్దానాలకు జీవోలు జారీ చేయకపోగా, ప్రస్తుతం ఉన్న ఆప్కాస్ సంస్థను సైతం రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనుకోవడం దుర్మార్గమని చెప్పారు. అటువంటి చర్యలను విరమించుకొని కార్మికులను పర్మినెంట్ చేయాలని స్థానిక మున్సిపాలిటీలో చెత్త తరలించే వాహనాలను పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయించి వాహనాలపై పని చేస్తున్న కార్మికుల ప్రాణాలను కాపాడాలని పేర్కొన్నారు. వాహనాలకు ఇన్సూరెన్సులు పూర్తిస్థాయిలో చేయాలని, గత సమ్మె కాలపు వేతనం మంజూరు చేయాలని, కార్మికులకు రక్షణ పరికరాలు అందించాలని, పట్టణ అవసరాలకు అను గుణంగా పారిశుధ్య వాహనాలను సమకూర్చాలని, చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియాలు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సిబ్బందిని పెంచాలని పలుమార్లు అధికారులకు తెలియజేసినప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరిని విడనాడి సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో రానున్న కాలంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ కె. నాగేంద్రబాబు, యూని యన్ అధ్యక్షులు పులి శాంప్రవీణ్, ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, దియ్యాల దేవమ్మ, ప్రధాన కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, కార్యదర్శులు బద్వేల్ ప్రవీణ్ కుమార్, నాగరపు సత్యరాజు, కమిటీ సభ్యులు ఇండ్ల చంద్రశేఖర్,పద్మిశెట్టి రామయ్య,పి.పి.వరప్రసాద్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఇ-శ్రమ్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-కడప : అసంఘటిత కార్మికులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ చేతుల మీదుగా ఇ-శ్రమ్ కార్డులను అందజేశారు. అసంఘటిత కార్మికుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి–యజమాని సమస్యలు, ఇ–శ్రమ్ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అని సూచించారు. అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను గుర్తించడం, వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. అనంతరం అసంఘటిత కార్మికులకు ఇ–శ్రమ్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ హ్యాండ్లూమ్ టెక్స్టైల్ కడప, రీజినల్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ కడప, ప్రాజెక్ట్ డైరెక్టర్ డ్వామా కడప, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కడప, కడప మేనేజర్ మున్సిపల్ కార్పొరేషన్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కడప, మండల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కడప, మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారులు చింతకొమ్మదిన్నె, వల్లూరు, పెండ్లిమర్రి, చెన్నూరు, డిస్టిక్ ఆఫీసర్ కడప, వివిధ రంగాల అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షులు లెక్కల జోగిరామిరెడ్డి కోరారు. మంగళవారం డిఇఒ షంషుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగిరామిరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 3న ప్రయివేట్ పాఠశాలల ప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారని చెప్పారు. పలు అభ్యంతరాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. అవసరమైన మార్పులు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. మూడు నెలలు గడిచిన మార్పులు లేకుండా ఫార్మ్ –1 నింపమని ప్రొసీడింగ్ ద్వారా తెలియజేశారని చెప్పారు. ఇది తమకు అసంతృప్తిగా ఉందని తెలిపారు. మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం మార్పులు చేసిన తరువాత మాత్రమే త పాఠశాలలు ఫార్మ్ - 1 నింపుతామని చెప్పారు. ప్రస్తుతం డిఎస్‌సి పరీక్షల కారణంగా తమస్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మెమోలు తీసుకుని కోచింగ్ కోసం వెళ్లారని పేర్కొన్నారు. టీచర్ల వివరాలు ఆన్‌లైన్‌లో నింపడం కష్టంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మినహాయింపులు అసంబద్ధంగా ఉండడంతో తాము కోర్టును ఆశ్రయించామని తెలిపారు. కార్యక్రమంలో కృస్మా ట్రెజరర్ రామాంజనేయరెడ్డి, ఉపాధ్యక్షులు బ్రహ్మానందరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, సాధన శ్రీనివాసులు, బద్వేల్ కృస్మా ప్రెసిడెంట్ కుమార్, లక్ష్మీ విద్యారణ్య కరస్పాండెంట్ శంకర్ రెడ్డి, మహేశ్వరి హై స్కూల్ కరస్పాండెంట్ మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస హై స్కూల్, బ్లూ బెల్స్ హై స్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి, ప్రగతి హై స్కూల్ కరస్పాండెంట్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.



డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న జోగిరామిరెడ్డి

మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు కన్నుమూత

- పలువురు నాయకుల సంతాపం

ప్రజాశక్తి -రాయచోటి



తెలుగుదేశం పార్టీలో విషాదం చోటు చేసుకుంది.తెలుగు దేశం పార్టీ మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాల కొండ్రాయుడు (78) మంగళవారం తెల్లవారు జామున కన్ను మూశారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి అంటే రాయుడు, రాయుడు అంటే టిడిపి అనేలా ఆయన రాజకీయ ప్రస్థానం సాగింది. ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బెంగళూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగి పోయారు. పాలకొండ్రాయుడు మరణ వార్త విన్న వెంటనే రాష్ట్రం, జిల్లాలోని పలువురు ప్రముఖ నాయకులు సుగవాసి బ్రదర్స్‌కు ఫోన్ ద్వారా తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జీవిత ప్రస్థానం : పాలకొండ్రాయుడు దాదాపు మూడు దశాబ్దాల పాటు రాయచోటిలో కీలక నేతగా సేవలు అందించారు.1946 జులై 3న పాలకొండ్రాయుడు రాయచోటి మాసాపేటలో జన్మించారు. ఆయన రాయచోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత సాధించారు. 1968 సంవత్సరంలో డిసెంబర్ 3న వివాహం చేసుకున్నారు. పాలకొండ్రాయుడుకు ఇద్దరు కుమారులు బాలసుబ్రమణ్యం, ప్రసాద్ బాబుతో పాటు కుమార్తె ఉన్నారు. ఆయన కుమారులు సుగవాసి ప్రసాద్ బాబు, బాలసుబ్రమణ్యం ప్రస్తుతం టిడిపిలో కొనసాగుతున్నారు. అయితే చాలా కాలం నుంచే పాలకొండ్రాయుడు రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

రాజకీయ ప్రస్థానం : పాలకొండ్రాయుడు రాయచోటి ఎమ్మెల్యేగా నాలుగు సార్లు, రాజంపేట ఎంపీగా ఒక్కసారి పని చేశారు.1978లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి తొలి సారిగా జనతా పార్టీ తరపున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మహల్ హబీబుల్లా పై విజయం సాధించారు. 1983లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కీ.శే.మాజీ ఎమ్మెల్యే మహల్ హబీబుల్లా సతీమణి మహల్ షవరున్నిసాపై విజయం సాధించారు. అనంతరం ఎన్‌టిఆర్ టిడిపి పార్టీ స్థాపించి టిడిపిలోకి ఆహ్వానిచండంతో పాల కొండ్రాయుడు టిడిపిలో చేరి 1984లో రాజంపేట పార్లమెంటు స్థానానికి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి అన్నయ్య గారి సాయి ప్రతాప్‌పై విజయం సాధించారు. అనంతరం 1990లో కాంగ్రెస్ అభ్యర్థి మండిపల్లినాగిరెడ్డి పై పోటి చేసి తొలి సారి ఓటమి పాలయ్యారు. 1992లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో మండిపల్లి నారాయణ రెడ్డిపై పోటీచేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 1994లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 1999లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి మండిపల్లి నారాయణరెడ్డిపై పోటీ చేసి విజయం సాధించారు. 2004లో రాయచోటి అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చి శ్రీలత రెడ్డికు టికెట్ ఇవ్వడంతో ఆమెపై సైతం పాలకొండ్రాయుడు విజయం సాధించారు.2009లో గడికోట శ్రీకాంత్ రెడ్డి పై పోటు చేసి ఓటమి పాలయ్యారు.

31 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానంలో 8 దఫాలు ఎమ్మెల్యేగా పోటి చేసి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాజంపేట పార్లమెంట్ స్థానానికి రెండు దఫాలు పోటీ చేసి ఒక సారి ఎంపిగా విజయం సాధించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. రాయుడు వారసులు సుగవాసి బాలసుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్ బాబులు ప్రస్తుతం తెలుగు దేశం పార్టీలో కొనసాగుతున్నారు. రేపు గురువారం ఉదయం 9 గంటలకు గౌతమ్ థియేటర్ వద్ద అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

పలువురు నాయకులు సంతాపం:

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాస్ రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్. రమేష్ కుమార్‌రెడ్డి, ద్వారకనాథ్ రెడ్డి, మోహన్ రెడ్డి, టిడిపి నియోజక వర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, హరి ప్రసాద్, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, నియోజకవర్గం లోని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాలకొండ్రాయుడు పార్థివ దేహాన్ని సందర్శించి సంతాపం తెలిపి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వాస్తవాలు తెలుసుకోవాలి

ప్రజాశక్తి - కడప

ఆరోపణలు చేసే ముందు నిజాలు తెలుసుకొని విమర్శలు చేస్తే బాగుంటుందని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మాజీ ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎమ్మెల్యే మాధవి అవినీతి అక్రమాలు బయట పెడుతుంటే విమర్శలు చేయడం దారుణం అన్నారు. కడప ప్రజలకు ఆమె చేస్తున్న అక్రమాలు ఒక్కోటి బయట పడుతున్నాయని భయపడుతున్నట్లున్నారని చెప్పారు ఆమె చేస్తున్న తప్పులు ఎత్తి చూపితే నిరాధార ఆరోపణలు చేయడం తగవని పేర్కొన్నారు. ఆరోపణలు చేసే ముందు తెలుసుకుని విమర్శలు చేస్తే బాగుంటుంది అని సూచించారు. బిల్డింగ్ యజమానులు దగ్గర లక్షలాది రూపాయలు డిమాండ్ చేస్తున్నారు అన్నారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, కార్పొరేటర్ శ్రీరంజన్ రెడ్డి, శంకరాపురం సింధు పాల్గొన్నారు.

సులభమైన పద్ధతిలో ఆంగ్ల వ్యాకరణం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని కొండాయపల్లిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ కార్యదర్శి అమీరుద్దీన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో సులభమైన పద్ధతిలో ఆంగ్ల వ్యాకరణాన్ని ఎలా నేర్చుకోవాలి అనే పాఠాన్ని ఆంగ్ల ఉపాధ్యాయులు, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ డి.రూత్ ఆరోగ్య మేరి బోధించారు. సులభమైన పద్ధతిలో ఆంగ్ల వ్యాకరణం విద్యార్థుల కోసం ఈ వేసవి శిబిరంలో నేర్పిస్తున్నారు. విద్యార్థులకు ఆంగ్ల వ్యాకరణం ప్రాముఖ్యత గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను తెలియజేశారు. స్పష్టమైన కమ్యూనికేషన్ కొరకు మంచి వ్యాకరణం విద్యార్థులకు వారి ఆలోచనలు, అభిప్రాయాలను మాట్లాడడంలో, రాయడంలో స్పష్టంగా కచ్చితంగా వ్యక్తిగరించడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు.

ఉద్యోగికి విరమణ తప్పనిసరి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడప

ఉద్యోగ విరమణ చెందడం అనేది ప్రతి ఒక్కరికీ ఒక కీల కమైన మలుపు అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామ చంద్రారెడ్డి అన్నారు. మేజర్ విజయ భాస్కర్ అందించిన సేవలు అభినం దనీయమని పేర్కొ న్నారు. ఇటీవల రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విరమణ పొందిన ఫిజికల్ డైరెక్టర్ ఎన్‌సిసి అధికారి మేజర్ విజయ భాస్కర్‌కు మంగళ వారం కడప ఆఫీసర్స్ క్లబ్ లో క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన ప్రతిక్కొరూ ఎందరో విద్యార్థుల భవిష్య త్తును తీర్చిదిద్దుతూ, ఒకానొక దశకు చేరిన తర్వాత ఆ ఉద్యోగం నుంచి పక్కకు తప్పుకోవడం,. అప్పటివరకు తన జీవితంలో చేసినటువంటి గొప్ప పనులను ఒకసారి తలుచుకోవడం సాధారణమన్నారు. విజయభాస్కర్ ఎన్‌సిసి అధికారిగా , ఫిజికల్ డైరెక్టర్‌గా వందలాది మంది విద్యార్థులను ఆర్మీ అధికారులుగా, వ్యాయామ ఉపాధ్యాయులుగా , వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడేందుకు శాయశక్తులా కృషి చేశారని చెప్పారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన జానుమద్ది విజయ భాస్కర్ మాట్లా డుతూ విజయభాస్కర్ వ్యక్తిగతంగా సౌమ్యుడు, స్నేహశీలి, ఇతరులకు సహాయం చేసే గుణం కలవాడని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ సాంబశివారెడ్డి, పారిశ్రామికవేత్త లేపాక మధు సూదన్‌రెడ్డి, రమణ కుమార్, ఎంఇఒ సుబ్బరామయ్య, రాజంపేట డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బి. ఆదినారాయణ, డాక్టర్ రాజమోహన్‌రెడ్డి, ఇక్కడ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు హజరత్తయ్య పాల్గొన్నారు.



విజయభాస్కర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ

ప్రసూతి సెలవులపై హర్షం

ప్రజాశక్తి-కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు మరో శుభవార్త చెప్పడం హర్షణీయమని, 21జీవో ను సిఎం చంద్రబాబు నాయుడు విడుదల చేసినందుకు ఎపిఎన్‌జిఒ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్ని కాన్పులకైనా 180 రోజుల జీతంతో కూడిన సెలవులు ఇవ్వడం హర్షణీయమని చెప్పారు. జీవో రావడానికి కృషి చేసిన ఏపీ ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కె.వి. శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యా సాగర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, మహిళా విభాగ కన్వీనర్ భారతి, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్ రెడ్డి, బి.కృష్ణ కుమారి, సిటీ యూనిట్ ఉపాధ్యక్షులు సి. వై. చందన, టి.గాయత్రి, జి.శోభారాణి, యం.శాంతి, ఎస్.జానకి, ఎం.అరుణమ్మ, బి.బేబీ, జి.మెర్రీ, జమున, సిటీ సెక్రటరీ నాగభూషణం పాల్గొన్నారు.

నేడు చెన్నూరులో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-చెన్నూరు : ఉచిత స్త్రీ వ్యాధులు, సంతాన సాఫల్య మెగా వైద్య శిబిరాన్ని ఈనెల 7న చెన్నూరులోని నిస్సి ఫిజియోథెరపి క్లినిక్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సంతాన సాఫల్య వైద్య నిపుణులు డాక్టర్ వై.ప్రమోద తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాతృశ్రీ ఐవిఎఫ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో మహిళలకు సంబంధించిన అన్ని వ్యాధులకు ఉచితంగా చూస్తామని పేర్కొన్నారు. సంతానం లేక బాధపడుతున్న దంపతులకు కూడా డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమన్నారు. తమ వంతు సామాజిక బాధ్యతతో శిబిరాలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంతాన లేమితో బాధపడుతున్న దంపతులకు ఉచితంగా కౌన్సెలింగ్ ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. శిబిరానికి విచ్చేసే స్త్రీలు, గర్భిణులు, సంతానలేమి దంపతులు తమ వెంట పాత రిపోర్టులను తీసుకురావాలన్నారు. అపాయింట్మెంట్ కోసం 9505046850,9849279800లలో సంప్రదించాలని ఆమె కోరారు.

మున్సిపల్ కార్మికులను తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి- కడప అర్బన్ : జిల్లావ్యాప్తంగా 60 ఏళ్లు దాటిన మున్సిపల్ కార్మికులను పనిలోకి రావద్దని చెప్పడం సరైంది కాదని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, కోశాధికారి గోపి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా తాతల, ముత్తాతల కాలం నుంచి పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను 60 ఏళ్లు దాటినవారు రావద్దని చెప్పడం, జీతాలు పెట్టొద్దని చెప్పడం సరైనది కాదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పాలకులు అన్ని రకాల ఉద్యోగులను 62 సంవత్సరాల వరకు పెంచిందని తెలిపారు. అయితే మున్సిపల్ కార్మికులను 60 ఏళ్లకే ఇళ్లకు పంపడం సరైన కాదని పేర్కొన్నారు. ఒకవేళ రిటైర్మెంట్ చేయదలుచుకుంటే ఒక వర్కర్‌కు రూ.10 లక్షలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, నెలకు పదివేలు పెన్షన్ ఇవ్వాలని తెలిపారు. మున్సిపల్ వృత్తి మీదనే ఆధారపడి ఇక్కడే పని చేశారని పేర్కొన్నారు. అలాంటి వారిని ఉత్తచేతులతో ఇంటికి పంపడం దారుణమని తెలిపారు. పాలకులు, మున్సిపల్ మంత్రి, సంబంచిన అధికారులు జోక్యం చేసుకుని 62 సంవత్సరాల వరకు కొనసాగించలాని పేర్కొన్నారు. రిటైర్ అయిన వారికి అన్ని రకాల బెనిఫిట్స్ ఇవ్వాలని తెలిపారు.

సాంకేతికతను ఉపయోగించుకోవాలి

ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు పి.వి. సత్యనారాయణ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

చిన్న, సన్నకారు రైతులు సాంకేతికతను అంది పుచ్చుకొని అధిక దిగుడులు సాధించే విధంగా వినియోగించుకోవాలని ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవి ద్యాలయ లాంగ్ గుంటూరు పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.వి. సత్యనారాయణ పేర్కొన్నారు. దక్షిణ మండలి వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం మంగళవారం ఊటుకూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో యూరి యా, నానో డిఎపి సమర్థత స్థాయిని పరిశీలించాలని, పరిశోధనా ఫలితాలను త్వరతగతిన వెల్లడించడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రభుత్వానికి సబ్సిడీ భారం తగ్గించాలని చెప్పారు. భూమి, వాయు, నీటి కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడగలమని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పురుగు మందుల అవశేషాలను ఆహార ధాన్యాలు, కూరగాయలు పండ్లలో త్వరగా నిర్ధారించే పద్ధతులను గుర్తించి అందుకనుగుణంగా పురుగు మందుల అవశేషాలను నిర్మూలించే పరిశోధనలను వేగంగా పూర్తి చేయాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ సమావేశానికి శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, రైతులు కీలక భాగస్వాములు కనుక ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక కోసం తమ విలువైన సూచనలు ఇవ్వాలని కోరారు. కీటక శాస్త్రం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి ప్రధాన శాస్త్రవేత్త మురళీకృష్ణ మాట్లాడుతూ పురుగు మందుల అవశేష నిర్మూలన పద్ధతులు అడివి పందుల యాజమాన్యం గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం, ఊటుకూరు, ప్రభాకర్ రెడ్డి, ఏరువాక కేంద్రం, ఊటుకూరు, సమన్వయకర్త అంకయ్య కుమార్, కృషివిజ్ఞాన కేంద్రం, ఊటుకూరు సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, శాస్త్రవేత్తలు డా.కె.సునీల్ కుమార్, డాక్టర్ మధురి, డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ భావతప్రియ, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ వి.శిల్పకళ, డాక్టర్. టి.మహేష్ బాబు, కె. సాయి మహేశ్వరి, యస్. మానస, ఐ.సురేష్ కుమార్ రెడ్డి ఐదు జిల్లాల పరిశోధన, విస్తరణ కేంద్రాల శాస్త్రవే త్తలు, జిల్లా వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, పరిశోధన, విస్తరణ సలహా మండలి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.వి. సత్యనారాయణ

చెన్నకేశవ స్వామి హుండీ ఆదాయం రూ.7.59 లక్షలు

ప్రజాశక్తి - వల్లూరు : మండలంలోని పుష్పగిరి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో రూ 7.59 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం హుండీ, చందాలు, సేవా టికెట్ల ద్వారా వచ్చిన నగదును లెక్కించారు. గతంలో పోల్చుకుంటే ఈసారి పుష్పగిరి బ్రహ్మోత్సవాల సందర్భంగా హుండీ ఆదాయం పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ కమిషనర్ జి.మల్లికార్జున ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న సిఐడి, రెవెన్యూ అధికారులు

సమగ్ర సర్వే, హద్దులు గుర్తించాలి

- అగ్రిగోల్డ్ భూముల పరిశీలనలో అధికారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని లోమడలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను సమగ్ర సర్వే చేసి, హద్దులు గుర్తించాలని సిఐడి అధికారులు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. తిరుపతికి చెందిన సిఐడి సిఐ రారాజు, తహశీల్దార్ నాగేశ్వరరావు, పులివెందుల సబ్ రిజిస్టర్ మోహనకుమార్ మంగళవారం అగ్రిగోల్డ్ భూములను పరిశీలించారు. గతంలో అగ్రిగోల్డ్ సంస్థ ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డిపాజిట్లు సేకరించింది. అనంతరం సంస్థ దివాలా తీయడంతో డిపాజిట్ దారులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. గతంలో ప్రభుత్వం అగ్రిగోల్డ్ భూములను స్వాధీనం చేసుకుని తక్కువ మొత్తంలో డిపాజిట్ చేసిన వారికి కొంతమేర నగదు చెల్లించారు. అప్పట్లో భూములను కొనుగోలు చేసిన అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన సుమారు 79 ఎకరాలను పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ, సిఐడి అధికారులు పాల్గొన్నారు.


రాధాకృష్ణవేణిని సన్మానిస్తున్న ఎంపిపి, సిబ్బంది

వేముల ఎంపిడిఒగా రాధాకృష్ణవేణి

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ఇఒపిఆర్‌డిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆమె వేముల ఎంపిడిఒగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెను మంగళవారం సిబ్బంది స్థానిక మండల సభ భవనంలో ఎంపిపి టి.లక్ష్మమయ్య అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ మూడేళ్లుగా ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి అందరి అభిమానాలు పొంది ప్రస్తుతం ఉద్యోగోన్నతిపై వెళ్లడం హర్షణీయమన్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి అధికారులతో సమన్వయంతో ముందుకు వెళ్లేవారని గుర్తుచేశారు. ఆమె విధులు నిర్వహించిన సందర్భంలో పని చేసిన సిబ్బంది తమ అనుభవాలు పంచుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వీరకిషోర్, తహశీల్దార్ రమాకుమారి, మైదుకూరు ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, డిటి కృష్ణారెడ్డి, మండల అధికారులు మ్యాగీ, రవిశంకర్, వంశీకృష్ణ, సావిత్రమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వసతి వివరాల సేకరణలో అధికారులు

ప్రజాశక్తి - చాపాడు

ఈనెల 27 నుంచి కడప సమీపంలో జరగనున్న టిడిపి మహానాడుకు సంబంధించి వివిధ జిల్లాల నుండి వచ్చే కార్యకర్తల కోసం వసతి ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలోని అన్ని మండలాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలు, కల్యాణ మండపాలు, ఇంజినీరింగ్, బిఇడి కళాశాలలు తదితర అందుబాటులో ఉన్న గదులు, మరుగుదొడ్ల వివరాలను అందజేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ కార్యాలయం నుండి ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు తహశీల్దార్లకు ఆ గ్రామాల్లోని వీఆర్వోలతో వివరాలను సేకరించి కలెక్టర్ కార్యాలయానికి అందజేస్తున్నారు. గదులు, మరుగుదొడ్లు, నీటివసతి, విద్యుత్ సరఫరాకు సంబంధించి నివేదికను సిద్ధం చేసి పంపుతున్నారు. పార్టీ కార్యక్రమానికి సంబంధించి రెవెన్యూ శాఖ సిబ్బందితో వివరాలను సేకరించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వంతెనపై అటాచ్డ్ రబ్బర్లు వేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు - ముద్దనూరు మార్గంలో వంతెనపై అటాచ్డ్ రబ్బర్లు వేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం వంతెనపై దెబ్బతిన్న రోడ్డును పరిశీ లించారు. అనంతరం శివకుమార్ మాట్లాడుతూ నిత్యం వందల కొద్ది వాహ నాలు రాకపోకలు సాగించే రోడ్డు అక్కడక్కడ గుంతలు ఏర్పడ్డాయని, ప్రయా ణికులకు తీవ్ర సౌకర్యంగా ఉందన్నారు. రాత్రి సమయంలో మరీ ప్రమాద కరంగా ఉందన్నారు. గుంతలలో వాహనాలు పడి ప్రమాదాలకు గురవు తున్నారన్నారు. అధికారులు గమనించి వంతెనపై అటాచ్డ్ రబ్బర్లు వేసి రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్, పట్టణ నాయకులు పాల్గొన్నారు.


గుంతలుగా ఉన్న రోడ్డును చూపుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ఇంటర్ ప్రవేశాలకు ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు పొందాలని అధ్యాపకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్ ప్రవేశాల నిమిత్తం హెచ్ఎం చెరుకూరి శ్రీనువాసులు ఆధ్వర్యంలో అధ్యాపకులు ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో చేరితే విద్యార్థులకు కలిగే వసతులు, సౌకర్యాలను వివరించారు. బైపిసి, సిఇసి గ్రూపులు ఉన్నట్లు చెప్పారు. సెక్షన్లకు 20 మంది విద్యార్థులు చొప్పున రెండు గ్రూపులు కలిపి 40 మందికి సీట్లు కేటాయించామన్నారు. ఇప్పటికే రెండు గ్రూపులో కలిపి 20 మంది విద్యార్థులకు అడ్మిట్ కార్డులు అందజేసినట్లు చెప్పారు.

అన్నారెడ్డి పేరమ్మ నేత్రదానం

వేముల : మండలంలోని చింతల జూటూరు గ్రామానికి చెందిన అన్నారెడ్డి పేరమ్మ (80) మరణించడంతో ఆమె కుమారులు లక్ష్మిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, కుమార్తె శివకుమారి నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. టెక్నీషియన్ హరీష్ మృతురాలి గ్రామానికి వెళ్లి కార్నియాలను సేకరించి హైద్రాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. నేత్రదానం చేసేందుకు 99665 09364, 70932 04537కు సమాచారమివ్వాలని రాజు కోరారు. నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులకు సేవా సమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపింది.


నేత్రాలను దానం చేస్తున్న పేరమ్మ కుటుంబ సభ్యులు

నిరుపయోగంగా పశు వైద్యశాల భవనం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలంలోని జీవి సత్రంలో పశువైద్యశాల భవనం నిరుపయోగంగా మారింది. పశువైద్యశాలను నిర్మించి అందులో విధులు నిర్వహించకపోవడంతో ప్రాంగణమంతా కంపచెట్లు, వ్యర్థ పదార్థాలతో నిండి అపరిశుభ్రతగా తయారైంది. గత ప్రభుత్వంలో ఈ భవనంలో సచివాలయం నిర్వహించారు. తర్వాత సచివాలయ భవనాన్ని నూతనంగా నిర్మించడంతో మళ్లీ ఈ భవనం వృథాగా మారింది. భవనం చుట్టూ ప్రహరీ, ఖాళీ ప్రదేశం అందుబాటులో ఉన్నప్పటికీ వినియోగించకపోవడంతో నిరుపయోగంగా తయారైంది. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వ భవనాలు నిర్మించడం, వాటిని వినియోగించకపోవడంతో అవి నిరుపయోగంగా తయారవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నూతన భవనాలను నిర్మించకుండా పశువైద్యశాలను ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పశువైద్యశాల భవనం నిరుపయోగంగా మారడంతో ఈ ప్రాంతంలో విషపురుగులు అధికంగా తిరుగుతున్నాయి. కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని ఏదైనా ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న జివి సత్రం పశువైద్యశాల భవనం

జ్వరం వస్తే రక్త పరీక్షలు తప్పనిసరి


ఆరోగ్య కార్యకర్తలకు సూచనలిస్తున్న వైద్యులు పృథ్వీకుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ వైద్య సిబ్బంది రక్త పరీక్షలను చేయాలని తాళ్లపల్లె ప్రభుత్వ వైద్యులు పృథ్వీకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు, ఫ్రైడే-డ్రైయిడే ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాధులపై ముందుగా ఆశా, ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మలేరియా రక్తపూతలను ప్రతి ఆశా, ఆరోగ్య కార్యకర్తలు అనుకున్న సమయంలోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి బుధవారం, శనివారం రక్తపూతలు ల్యాబ్‌కు అందజేయాలని కోరారు. ఆయా గ్రామాల్లో పర్యటించి దోమకాటు వల్ల ప్రజలకు సోకే వ్యాధులపై తెలియజేయాలన్నారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లడుతూ ప్రతి శుక్రవారం సచి వాలయం పరిధిలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించాలన్నారు. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరూ పాటిస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉండదని తెలి పారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, సిహెచ్ఒ వెంక టరత్నం, ఎంపిహెచ్ఇఒ బాబా ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్‌లు వెంకటలక్ష్మమ్మ, అరుణ దేవి, ల్యాబ్ టెక్నీషియన్ హరి ప్రసాద్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటిలో విద్యార్థులు ధర్నా

ఫీజు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇచ్చేదిలేదన్న అధికారులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో విద్యార్థులు మంగళవారం ధర్నాకు దిగారు. ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అధికారులు చెప్పిన ఫీజులు తాము చెల్లించాలేమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇడుపులపాయలో నిర్వహించే ఆర్కేవ్యాలీ, ఒంగోలు ట్రిపుల్‌ఐటి విద్యార్థులు దాదాపు 8 వేల మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు సెమిష్టర్ 2 పరీక్షలు అయిపోయాయి. 4 రోజుల్లోగా క్యాంపస్ నుండి వెళ్లి పోవాలని విద్యార్థులకు అధికారులు సూచించారు. ఈ క్రమంలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు తమకు తొందరలో సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరగా, ఫీజు బకాయిలు మొత్తం చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో ఆందోళనకు గురైనట్లు తెలిపారు. విద్యార్థుల వద్దకు పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ వెళ్లి డైరెక్టర్ సెలవులో ఉన్నారని, బుధవారం ఆయనను కలిసి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. ఉన్నత విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యార్థులు సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు.


ధర్నా చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

తాగునీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు


రోడ్డుపై వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - వేముల

దాహం.. దాహం.. అంటూ మండలంలోని మబ్బుచింతలపల్లె ప్రజలు మంగళవారం రోడ్డెక్కారు. కొన్ని రోజుల నుంచి గ్రామస్తులు తాగు నీటి కోసం గగ్గోలు పెడుతున్నారు. బిందెడు నీళ్లు రాక అవస్థలు పడు తున్నారు. ఉన్న పైపులైనులకు నీరు రాక ఉన్న బొర్లలోని నీరు కలుషితమయ్యాయి. మూడేళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో ట్యాంకర్లతో తాగునీరు అందించేవాళ్లు. కాంట్రాక్ట్ గడువు ముగియడంతో నాలుగు రోజుల నుంచి తాగునీరు సరఫరా కాలేదు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు మంగళవారం రోడ్డుపై యుసిఐఎల్ వాహనాలను అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మూడేళ్ల నుంచి కాంట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లను సరిగ్గా సరఫరా చేయట్లేదని ఆరోపించారు. తాగునీరు ఎప్పుడు అందిస్తారంటూ అధికారులను ప్రజలు నిలదీశారు. విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల నుంచి ఎస్సీ కాలనీలో పొలాల దగ్గర నుంచి తాగడానికి నీరును తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోయారు. వేసవి కాలంలో తాగడానికి నీరు లేకపోతే తాము ఎలా బతకాలని అధికారులను ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించేంతవరకు రోడ్డుపై నుంచి వెళ్లబోమని తేల్చి చెప్పారు. సమాచారం తెలుసుకున్న టిడిపి నాయకుడు శ్రీనాథ్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులతో సమస్యలను తెలుసుకొని యుసిఐఎల్ అధికారులతో మాట్లాడారు. ఆర్‌డబ్ల్యూఎస్ డిఇతో మాట్లాడగా తాగునీరు సమస్యను పరిష్కారం చూపాలని తెలిపారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని యుసిఐఎల్ అధికారులకు సూచించారు. రెండు రోజుల్లో తమ ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని యుసిఐఎల్ అధికారులు తెలిపారు. పులివెందుల సిఐ అజీవాలి స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

20 నుంచి కార్మికుల సమ్మె అనివార్యం : సిఐటియు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సంఘం పిలుపుమేరకు ఈనెల 20 నుండి 22వ తేదీ వరకు సమ్మె అనివార్యమని కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఆ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ సంఘ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్ మాట్లాడుతూ లేబర్ కోడ్ రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. ఆప్కాస్ కార్మికులందరినీ ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పచెప్పకూడదన్నారు. ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులు కోవిడ్ కార్మికులకు జిఒ నెంబర్ 36 ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. గత సమ్మె 17 రోజుల ఒప్పందాల జిఒలు అమలు చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ కోశాధికారి రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడు రమాదేవి, గురమ్మ, నీతమ్మ, అన్నపూర్ణ, శాంతి, జాకోబు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న కార్మికులు

ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. ఆ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సం దర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆసుపత్రిలో దాదాపు 70 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వీరికి దాదాపుగా మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎఫ్, ఇఎస్ఐ కూడా కార్మికులకు అందడం లేదన్నారు. ఈనెల 10లోపు జీతాలు ఇవ్వకపోతే 11వ తేదీ నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ప్రతినెల 5వ తేదీ నుండి 10లోపు జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. సానుకూలంగా స్పందించిన అధికారి మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, ఆసుపత్రి కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు రాఘవేంద్ర, ఆసుపత్రి సంఘ అధ్యక్షకార్యదర్శులు రత్నమ్మ, కళావతి, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

శ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No. 441/2023

టి.నరసింహ్మారెడ్డి, S/o టి.సుబ్బిరెడ్డి, హిందూ, వయస్సు 56 సం॥లు, వ్యాపారం, సాకిన్ పెద్దశెట్టిపల్లి గ్రామం, ప్రొద్దుటూరు మం॥, వైఎస్ఆర్ జిల్లా. ...వాది

Vs

కె.మున్నేంద్ర, S/o కె.మున్నెయ్య, హిందూ, వయస్సు 32 సం॥లు, బ్యాంకు ఎంప్లాయి, R/o పెద్దశెట్టిపల్లి గ్రామం, ప్రొద్దుటూరు మం॥, వైఎస్ఆర్ జిల్లా. ...ప్రతివాది

దావా సమను

యీ నెంబరు దావాను వాది నీ పైన ప్రామిసరీ నోటును గురించి రూ.3,34,666-00లను రాకోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో నీవు 13.5.2025వ తేదీన పగలు 10.30 ని॥లకు పై కోర్టులో హాజరు కావలెయును. లేనంతట ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 13.5.2025

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

ఇ.వి.సుధాకర్ రెడ్డి
ఎస్. నూరుల్లా
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.

LOSS OF PASSPORT

I, SUBBARAYUDU YERRAGOLLA S/o.Y.SUBBARAYUDU R/o. D.No.9/8, BUSI REDDY PALLI, VEERAPUNAYUNIPALLE MANDAL, YSR DISTRICT, A.P., have lost my original Passport bearing No.**C4300978** issued on 14/10/2024 Date of expiry 13.10.2034 place of issue at VIJAYAWADA, while I was moving in motor cycle from Veerapunayunipalle to Busireddypalle for my personal work. If anybody found please contact above address.

IN THE COURT OF THE IIIrd Addl. JUNIOR CIVIL JUDGE, KADAPA

E.P.No. 185/2024
O.S.No. 1094/2022

Siddigolla Obulesu. ...Petitioner/D.Hr.

Vs

Syed Eliyas, S/o Late S.Rasool, D.No.8/167, Prakash Nagar, Kadapa. ...Respondent/J.Dr.

నోటీసు

పై నంబర్ గల కేసులో ప్రతివాది/J.Dr. అయిన మీ పై మహారాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు కేసు దాఖలు చేసినారు. పై కేసు నందు మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల రాజశ్రీ పై నందు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరై 15.05.2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు తమరి ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల రాజశ్రీ కోర్టు వారు తమరికి పరోక్షముగా తీర్మానించెదరు.

వాయిదా తేది: 15.05.2025

//By Order of the Court//

GVIJAYAMARUTHI REDDY
Advocate,
Kadapa.


టిడ్కో ఇళ్లవద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గూడెంచెరువులోని టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేసి, లబ్దిదారులకు ఇవ్వాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం వివిధ ప్రదేశాల్లో పర్యటించారు. ముందుగా ఈ నెల 17న నారాపురం వెంకటేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. స్వామి వారిని దర్శించుకున్నారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుపై ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ రఫిక్ పాషా ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితం

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితమని పిహెచ్‌సి వైద్యాధికారులు శ్రీకాత్, నాగార్జున పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా నోడల్ అధికారి శోభాకుమారి అధ్యక్షతన ఆశా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. గర్భిణులను గుర్తించి వారి వివరాలు వంద శాతం నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించేలా అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. ప్రతి నెల నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్‌సిడి, సిడి సర్వే వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు గ్రామాల్లో పర్యటిస్తూ గర్భిణులను గుర్తించి ఎఎన్‌ఎంలకు పూర్తి సమాచారం అందించాలన్నారు. అర్హత కల్గిన దంపతులను గుర్తించి ట్రాకింగ్ పూర్తి చేయాలన్నారు. చిన్న పిల్లలను గుర్తించి వారిని విద్యాభ్యాసానికి ప్రోత్సహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు విటమిన్ ఎ సిరప్ అందించాలన్నారు. హెచ్‌బిఎన్‌సి, హెచ్‌బివైసి, విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డేస్, విలేజ్ హెల్త్ శానిటేషన్ కార్యక్రమాల్లో తప్పక పాల్గొని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, స్టాఫ్ నర్స్ రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల శిక్షణ, పంపిణీ టెండర్లలో అవినీతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బిసి మహిళల కుట్టుమిషన్ శిక్షణ, వాటి పంపిణీ టెండర్‌లో రూ.167 కోట్లు అవినీతి జరిగిందని, దానికి దిక్కెవరని వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి జి.గురుమూర్తి యాదవ్, బిసి సెల్ జమ్మలమడుగు నియోజకవర్గ అధ్యక్షులు జె.ప్రవీణ్ యాదవ్ పేర్కొన్నారు. దీనిపై స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ సొమ్మును కాపాడాల్సిన ప్రభుత్వ పెద్దలే అవినీతికి పాల్పడడం చూస్తూంటే ఈ రాష్ట్ర ప్రజలు దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్లు ఉందన్నారు. అవినీతి జరగకుండా చూడాలని, లేనిపక్షంలో వైసిపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొండాపురం జెడ్పిటిసి శేఖర్, బిసి సెల్ నియోజకవర్గ కార్యదర్శి వి.వెంకటకుమార్, నియోజకవర్గ బిసి నాయకులు కె.రాము. టి.శివ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

ఎర్రగుంట్ల : బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని రూరల్ వైద్యాధికారి డాక్టర్ జ్యోత్స తెలిపారు. మండలంలోని పోట్లదుర్తి అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బాలికలకు రుతుస్రావం, పరిశుభ్రత, బాల్య వివాహాలు వాటి వలన వచ్చే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతూ ఉంటే వెంటనే పంచాయతీ సెక్రటరీ, అంగన్వాడీ కార్యకర్త, ఎఎన్ఎం, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098కు గానీ సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ ముంతాజ్ బేగం, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, హెచ్ఇఒ రవిశంకర్ రాజు, సూపర్వైజర్ ఉమారాణి, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక బాలికలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రతి ఇంటికీ రేషన్ పంపిణీ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పులివెందుల వైసిపి పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, ఆర్టీఐ వింగ్ అధ్యక్షులు మారుతి రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు కార్తీక్, విద్యార్థి విభాగం అధ్యక్షులు పోరెడ్డి జశ్వంత్‌రెడ్డి సూచించారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ పులివెందులలో ప్రభుత్వం అందించే బియ్యం పొందాలంటే కూలి పనులు మానుకోవాల్సి వస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వారి ఇంటి వద్దకే వెళ్లి ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ ఇచ్చేవారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పులివెందులలో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. రేషన్ డీలర్లు తమకు వచ్చిన స్టాక్‌ను ఎండియు వాహనదారులకు ఇవ్వకుండా అరకొరగా, సమయ పాలన లేకుండా తూతూ మంత్రంగా పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రేషన్ బియ్యం ఇంటి ఇంటికి పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టాలని వైసిపి తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.

అద్దె భవనాలకు 8న వేలం

పులివెందుల టౌన్ : పురపాలక సంఘానికి చెందిన వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న గదులకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న ఉదయం మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేలంలో పాల్గొనువారు పురపాలక సంఘ కార్యాలయంలో రూ.100 చెల్లించి దరఖాస్తు పొందాల్సి ఉందన్నారు. వివరాలకు కార్యాలయ పనివేళల్లో రెవెన్యూశాఖలో సంప్రదించాలన్నారు. వేలంలో దక్కించుకున్న వారు మూడేళ్ల కాలానికి నెల అద్దె చెల్లించాల్సి ఉంటుందన్నారు.

IN THE COURT OF THE HON'BLE Spl. MOBILE COURT, KADAPA

O.S.No. 941/2022

1. Abbannagari Vijaya, W/o Lakshumaiah, Hindu, aged 56 years, House wife, R/at D.No.52/243-6, Nabikota, Kadapa City and Dist.
2. Athikari Bharathi, W/o A.Seshadri, Hindu, aged 48 years, House wife, R/at D.No.52/180, Nabikota, Kadapa City and Dist.

...Plaintiffs

Vs

1. Akula Anasuya, W/o Akula Venkata Ramana, Hindu, Aged 56 years, House wife, R/at D.No.9-433/C, Sai Nagar, Panchayat, Lingeswar Nagar, Tirupati Rural, Chittoor Dist.
2. Kalluru Sujatha, W/o Kondapalli Rajasekhar, Hindu, aged 53 years, House wife, R/at D.No.70/9, Alankhanpalli, Kadapa City.
3. Mallem Lakshumma, W/o Late Mallem Krishnaiah, Hindu, Aged 66 years, House wife, R/at D.No.52/180-1, Chemmumiyapeta Majara, Nabikota, Kadapa City.

...Defendants

3వ ప్రతివాదికి నోటీసు

పై తెలిపిన దావాలో వాది ప్రతివాది అయిన మీపై 9/8/2021 మొదటి ప్రతివాది, రెండవ ప్రతివాది అయిన మీకు వ్రాసిచ్చిన విక్రయ దస్తావేజును రద్దు చేయమని పై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకేమైన అభ్యంతరములు వున్న ఎడల 8.5.2025 తేదీన ఉ॥10.30 గం॥లకు మీరుగాని మీ తరపున వకీలు గాని హాజరై ఆక్షేపణ తెలుపుకొనవలయును. లేనంతట మీకు పరోక్షముగా తీర్పు తీర్మానించబడును.

//By Order of the Court//

V.RAMA MOHAN,
K. RAMA MOHAN,
B.N.AKBAR ALIKHAN
Advocates, KADAPA.